సమయం లేదు రైతన్నా..!

- ఈ నెల 10 వరకూ ఈ-కేవైసీ గడువు పొడిగించిన రాష్ట్ర ప్రభుత్వం
- మూడు నియోజకవర్గాల్లోనూ 2,43,068 ఎకరాలు పెండింగ్
- సకాలంలో పూర్తిచేసేలా అధికారుల కసరత్తు



ఈ- కేవైసీ కోసం రైతుల నుంచి వేలిముద్రలు సేకరిస్తున్న వ్యవసాయాధికారులు

రాయదుర్గం/కళ్యాణదుర్గం: రైతులకు ఏ సహాయం చేయాలన్నా .. ఏ పథకం కింద లబ్ధి చేకూరాలన్నా ఈ-క్రాప్‌లో నమోదైన వివరాలనే రాష్ట్ర ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటుంది. రైతులు ఎంత విస్తీర్ణం లో ఏ పంట సాగు చేస్తున్నా తప్పకుండా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని అధికారులు నిత్యం చెపుతున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ వంద శాతం పూర్తికావచ్చినా, దానికి అనుసంధానంగా చెప్పుకునే ఈ-కేవైసీ (వేలిముద్రల) సేకరణలో వెనుకబడ్డారు. ఓ వైపు గడువు తరముకొస్తున్నా, ఈ-కేవైసీ విషయంలో మాత్రం కొందరు రైతులు నిర్లక్ష్యం చేస్తున్నారు. ఇలా అయితే రైతు సంక్షేమ పథకాల లబ్ధి కోల్పోవలసి వస్తుంది.రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఈ ఏడాది ఖరీఫ్ లో 51,2,407 ఎకరాల్లో పంటల సాగు విస్తీర్ణం నమోదైంది. ఇందులో 49,6,977 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయింది. 2,51,909 ఎకరాల్లో ఈ-కేవైసీ చేపట్టగా, మిగిలిన 2,43,068 ఎకరాలు పెండింగ్ లో ఉంది. సెప్టెంబర్ 30 నాటికి ఈ-క్రాప్, ఈ-కేవైసీల నమోదుకు గడువు ముగిసింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 10 వరకూ గడువు పొడిగించింది. దీంతో మరో రెండు రోజులు మాత్రమే అవకాశం మిగిలి ఉంది. ఈ విషయంలో రైతులు శ్రద్ధ కనబరచి సకాలంలో వేలిముద్ర ప్రక్రియ పూర్తి చేయించుకోవాలి.

ప్రయోజనాలు ఇలా..

అన్నదాతల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. వ్యవసాయం లో మునుపెన్నడూ లేని విధంగా వివిధ రకాల పథకాలను అమల్లోకి తీసుకొచ్చారు. విత్తు నుండి విపత్తుదాక అన్నదాతను చెయ్యిపట్టి నడిపించేలా కృషి చేస్తున్నారు. ఈ మధ్యలో ఏ నష్టం చూకూరినా పరిహారం అందిస్తూ ఆదుకుంటున్నారు. ఇన్పుట్ సబ్సిడీ, పంటల బీమా, సున్నా వడ్డీ, పంట ఉత్పత్తులు, కొనుగోలు, రైతు భరోసా కేంద్రంలో ఎరువులు, పురుగు మందులు ఇలా అన్నింటికీ ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు వివరాలనే ఆధారం చేశారు. ప్రకృతి విపత్తులు, వాతావరణం మార్పుల వల్ల ఏర్పడే పంట నష్టానికి వీటినే ప్రమాణికంగా తీసుకోనున్నారు.

ఈ-కేవైసీ వివరాలు ఇలా

నియోజకవర్గం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	పంట నమోదు విస్తీర్ణం (ఎకరాల్లో)	ఈ-కేవైసీ చేయించుకున్నవారు	పెండింగ్ ఉన్న రైతులు
రాయదుర్గం	1,71,926	1,71,926	96,9999	74,927
కళ్యాణదుర్గం	1,73,093	1,73,093	96,699	74,394
ఉరవకొండ	1,67,388	1,51,985	58,211	93,747

రైతు సంక్షేమానికి సీఎం కృషి



అన్నదాతల సంక్షేమానికి సీఎం జగన్ విశేష కృషి చేస్తున్నారు. ఈ కారణంగా ఈ-క్రాప్, ఈ-కేవైసీల విషయంలో అధికారులు జాగ్రత్తలు పాటించాలి. ప్రకృతి విపత్తులు, వర్షాభావ పరిస్థితుల వల్ల నష్టపోయిన ప్రతి రైతుకూ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోంది.

– కాపు రామచంద్రారెడ్డి, ప్రభుత్వ విప్

ఈ క్రాప్ బుకింగ్ చేయించుకున్నా..



నాకు 5 ఎకరాలు పొలం ఉంది. ఖరీఫ్‌లో వేరుశనగ పంట వేశాను. ఇటీవల ఆర్బీకే సిబ్బందిచే పంటను ఈ క్రాప్ బుకింగ్ చేయించాను. ఆర్బీకే వద్ద ఈ కేవైసీ కూడా వేశాను. ఈ క్రాప్ బుకింగ్ రైతులకు ఎంతో మేలు.

–రామాంజనేయులు. రైతు, గూళ్యం, కంబదూరు మండలం

ఈ నెల 10లోపు పూర్తి చేస్తాం



వ్యవసాయ డివిజన్లో ఈనెల 10 లోపు రైతుల ఈ కేవైసీకి చర్యలు తీసుకుంటున్నాం. ఆర్‌బీకే స్థాయిలో సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండేలా ఆదేశాలిచ్చాం. క్షేత్రస్థాయిలో సిబ్బంది లేని ఆర్‌బీకేల పరిధిలో వలంటీర్లతో సేవలు అందిస్తున్నాం.

– యల్లప్ప, ఏడీఏ, కళ్యాణదుర్గం

నేడు డయల్ యువర్ డీఎం

ఉరవకొండ: ఉరవకొండ ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యలు, డిపో అభివృద్ధికి సలహాల కోసం సోమవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు డీఎం బాలజీ దయాల్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్యలో 9959225861 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలపాలన్నారు.

రాయదుర్గంటౌన్: రాయదుర్గం ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణీకుల సమస్యలపై సోమవారం ‘డయల్ యువర్ డీఎం’ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం సురేష్ కుమార్ తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల మధ్య 9959225863 నంబర్‌కు ఫోన్ చేసి ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలతోపాటు సలహాలు, సూచలనలు అందజేయాలని ఆయన కోరారు.

చెట్లు నరికితే కేసులు

కుందుర్పి: అటవీ ప్రాంతాల్లో చెట్లను నరికితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జంబుగుంపల అటవీ శాఖబీట్ ఆఫీసర్ పరమేశ్వరప్ప హెచ్చరించారు. ఆదివారం ఆయన అటవీ ప్రాంతంలో పర్యటించి పరిసర గ్రామాల రైతులు, పశువుల కాపర్లకు అడవుల పరిరక్షణ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వేసవిలో అడవులకు నిప్పు పడకుండా అందరూ సహకరించాలని సూచించారు. మొక్కల పెంపకంతోనే పర్యవరణ పరిరక్షణ సాధ్యమవుతుందని సూచించారు. కార్యక్రమంలో రైతులు, పశువుల కాపర్లు, వన సంరక్షణ సమితి సభ్యులు పాల్గొన్నారు.

రేపు జగనన్న ఆరోగ్య సురక్ష

కూడేరు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం కూడేరులోని సచివాలయం వద్ద నిర్వహించనున్నట్లు వైద్యాధికారి సరిత, ఎంపీడీఓ ఎంకే బాషా, తహసీల్దార్ శేషారెడ్డి ఆదివారం తెలిపారు. ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆర్టీసీ ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం



బస్సులో గిఫ్ట్ బాక్సు ఏర్పాటు చేసిన దృశ్యం

ఉరవకొండ: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ప్రయాణికులకు గిఫ్ట్ స్కీం ప్రవేశపెట్టినట్లు డీఎం బాలజీ దయాల్ ఆదివారం తెలిపారు. రాయదుర్గం రూట్‌లో వెళ్లే ఐదు బస్సుల్లో గిఫ్ట్ బాక్సులు ఏర్పాటు చేశారు. బస్సు దిగేముందు ప్రయాణికులు టికెట్ వెనుక పేరు, సెల్ నంబర్ రాసి గిఫ్ట్‌బాక్సుల్లో వేయాలన్నారు. ప్రతి నెలా రెండు సార్లు గిఫ్ట్ బాక్సులు ఓపెన్ చేసి లాటరీ ద్వారా విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కృష్ణా జలాల పంపిణీపై కేంద్రం కుట్ర

రాయదుర్గంటౌన్: కృష్ణా జలాల పంపిణీపై కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున విమర్శించారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. రానున్న తెలంగాణ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు మోదీ సర్కారు తీసుకుంటున్న చర్యలను తిప్పికొట్టేలా తక్షణం రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ సర్కారు కేంద్ర మంత్రిమండలి సమావేశంలో ఏపీకి నష్టం వాటిల్లేలా నిర్ణయం తీసుకోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైమానిక దళం సేవలు వెలకట్టలేనివి



సెల్యూట్ చేస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: ఇండియన్ ఎయిర్ ఫోర్స్ సేవలు వెలకట్టలేమని ఉపాధ్యాయుడు రాజన్న కొనియాడారు. ఆదివారం మండల కేంద్రంలోని ఆర్డీటీ పాఠశాల ఆవరణలో భారత వైమానిక దళ దినోత్సవం సందర్భంగా సైనికులకు ఘనంగా సెల్యూట్ చేశారు. ఆయన మాట్లాడుతూ 1932లో ఏర్పాటైన వైమానిక దళం ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద సైన్యంగా కీర్తి సాధించిందన్నారు. వైమానిక దళంలో ఉద్యోగావకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహనాల వేలం రేపు

కంబదూరు: కంబదూరు సెబ్ స్టేషన పరిధిలో మద్యం రవాణ కేసుల్లో పట్టుబడిన తొమ్మిది ద్విచక్ర వాహనాలను మంగళవారం వేలం వేయనున్నట్లు సెబ్ సీఐ మొహిద్దీన్ భాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.3 వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనాలని ఆయన సూచించారు.

నోముగడ్డ గంగమ్మకు పూజలు



గంగమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

బ్రహ్మసముద్రం: మండంలోని భైరసముద్రం సమీపంలోని నోముగడ్డ వంకలో వెలసిన గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మహిళలు అక్కడే వంటావార్పు చేపట్టి అన్నదానం నిర్వహించారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన



వైద్యశిబిరంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న నిపుణులు

ఉరవకొండ: స్థానిక రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల భవనంలో కర్నూలుకు చెందిన సుశీల నేత్రాలయ, సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యశిబిరాన్ని ప్రారంభించిన విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కిష్టప్ప మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల కోసం హెల్త్ కార్డు ద్వారా కంటి వైద్య నిపుణుల చేత వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. శిబిరంలో విశ్రాంత ఉద్యోగులతో పాటు వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, పలువురిని శస్త్రచికిత్సకు ఎంపిక చేశారు.

ఘనంగా పాస్టర్ల దినోత్సవం



రాయదుర్గంలోని చర్చిలో పాస్టర్ సల్మాన్ హంపన్న దంపతులను సత్కరిస్తున్న దృశ్యం



కంబదూరులోని చర్చిలో కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు, సంఘ పెద్దలు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో ఉన్న జీసస్ కాలింగ్ మినిస్ట్రీస్ చర్చిలో ఆదివారం ప్రపంచ పాస్టర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జేసీఎం పాస్టర్ సల్మాన్ హంపన్న దంపతులను సంఘం సభ్యులు సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుక జరుపుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్లు కిశోర్, జాన్‌పాల్ పాల్గొన్నారు.

కంబదూరు: మండల కేంద్రంలోని సీఅండ్ఐజీ మిషన్ చర్చిలో ఆదివారం ప్రపంచ పాస్టర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పాస్టర్లు జేమ్స్, సాల్మన్‌రాజును సంఘపెద్దలు, సంఘ సభ్యులు సత్కరించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు దినకర్, జాన్‌శాస్త్రి, ప్రభుదాసు, ఎస్.పాల్, విజయ్‌కుమార్, జకరయ్య, జాకోబ్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాలు.. ఇద్దరికి గాయాలు





గాయపడిన హనుమంతరాయుడు, వెంకటరమణ

కంబదూరు: మండల కేంద్రంలోని చెరువు కట్ట వద్ద ఆదివారం రాత్రి ఆటో బోల్తాపడిన సంఘటనలో ఒకరు గాయపడ్డారు.వివరాలు ఇలా ఉన్నాయి..కళ్యాణదుర్గం మండలం ఈస్ట్‌కోడిపల్లి గ్రామానికి చెందిన హనుమంతరాయుడు ఆటోలో పావగడకు వెళ్తుండగా.. కంబదూరు చెరువు కట్ట కింద ఉన్న క్రాస్ వద్ద ఆటో అదుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో హనుమంతరాయుడు తల, ఎడమకాలికి బలమైన గాయాలు తగిలి అపస్మారక స్థితిలో పడి ఉండగా స్థానికులు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. 108 సిబ్బంది అతడిని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ద్వి చక్ర వాహనం అదుపు తప్పి..

కూడేరు: స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపాన ఆదివారం అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అనంతపురంలోని మారుతీనగర్‌కు చెందిన వెంకటరమణ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాలు మేరకు.. వెంకటరమణ ద్విచక్ర వాహనంలో అనంతపురం నుంచి ఉరవకొండ వైపు వెళ్తుండగా అదుపు తప్పి ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టి కింద పడ్డాడు. గాయపడ్డ అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వేసవిని తలపిస్తున్న సూరీడు



మధ్యాహ్నం జన సంచారం లేక వెలవెలబోతున్న పాత టవర్‌క్లాక్ ఏరియా

రాయదుర్గంటౌన్: వారం నుంచి ఎండ వేడిమి, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరివుతున్నారు. రెండు రోజుల నుంచి 36 డిగ్రీల ఉష్ణోగ్రతతో ఎండలు మండుతున్నాయి. తీవ్ర వర్షాభావం నేపథ్యంలో సూర్యుడు భగ్గుమంటున్నాడు. వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులతో ప్రజల్లో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఎండల కారణంగా మధ్యాహ్నం 12 గంటలు దాటితే రోడ్లపై జనం కనిపించని పరిస్థితి ఉంది. మరోవైపు వాతావరణ మార్పు కారణంగా క్రమంగా సీజనల్ వ్యాధులు కూడా పంజా విసురుతున్నాయి.

పొంచి ఉన్న ప్రమాదం

కూడేరు: మండల కేంద్రంలో స్టేట్ బ్యాంక్ సమీపాన అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై ఏర్పడ్డ గుంతలతో వాహనాదారులకు ప్రమాదం పొంచి ఉంది. కొన్ని నెలల క్రితం ప్రధాన డ్రైనేజీ నీటిని స్టేట్ బ్యాంక్ నుంచి హెచ్చెల్సీ క్వార్టర్స్ వైపు మళ్లించడానికి రహదారిని తవ్వి సిమెంట్ పైపు ఏర్పాటు చేశారు. ఆర్‌అండ్‌బీ అధికారులు తవ్విన ప్రాంతంలో నాణ్యత లేకుండా మరమ్మతులు చేపట్టడంతో ప్రస్తుతం రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. ద్విచక్ర వాహనదారులు వేగంగా వచ్చి గుంతలపై వెళ్లడంతో అదుపు తప్పి కిందపడుతున్నారు. గుంతలున్న విషయం తెలియక వేగంగా వచ్చి వాహనాలకు బ్రేక్ వేయడంతో వెనుక వచ్చే వాహనాలు ఢీకొడుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాభివృద్ధి



కల్లుదేవనహళ్లిలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బొమ్మనహాళ్: వైఎస్సార్‌సీపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, లోకేష్, వైస్ ఎంపీపీ కందేపల్లి రమేష్ అన్నారు. ఆదివారం మండలంలోని కల్లుదేవనహళ్లిలో వారు పర్యటించి నిర్మాణంలో ఉన్న సొసైటీ గోదాము, నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డును పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి చొరవతో మండల వ్యాప్తంగా గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కల్లుదేవనహళ్లిలో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, సొసైటీ గోదాము, అంగన్‌వాడీ భవన నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణం, నాడు-నేడు ద్వారా పాఠశాల అభివృద్ధి, ఎస్సీ కాలనీలో పైప్‌లైన్ నిర్మాణం తదితర అభివృద్ధి పనులు జరిగాయన్నారు. అలాగే వైఎస్సార్ ప్రభుత్వంలో గ్రామీణ రహదారులకు మహర్దశ కలిగిందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆక్రమణలతో విద్యార్థినులకు ఇబ్బంది



జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఎదుట రోడ్డుపై సైకిళ్లు వదిలిన విద్యార్థినులు

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రధాన రహదారికి పక్కనే ఉన్న జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు సైకిళ్ల పార్కింగ్ చేసేందుకు ఇబ్బంది పడుతున్నారు. పాఠశాల ప్రహరీకి ఇరువైపులా ఆక్రమణల కారణంగా సైకిళ్లను రోడ్డుపై వరకు వదలాల్సిన దుస్థితి నెలకొంది. అంతేకాక కొందరు డ్రైవర్లు ప్రైవేటు అంబులెన్సు వాహనాలను కూడా అక్కడే పార్కింగ్ చేస్తుండడం సైకిళ్లు ఎక్కడ వదలాలో అర్థం కాని పరిస్థితి ఉందని విద్యార్థినులు వాపోతున్నారు. పాఠశాల యాజమాన్యం, పోలీసులు, మున్సిపల్ అధికారులు పట్టించుకోకవడంతో విద్యార్థినులు రోజూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. జెడ్పీ బాలికోన్నత పాఠశాలలోనే బాలికల జూనియర్ కళాశాల సైతం నడుస్తోంది. ఈ కారణంగా దాదాపు 1500 మందికిపైగా విద్యార్థినులు విద్యాలయాలకు హాజరవుతారు. వందలాది సైకిళ్లు బయట రోడ్డుపైనే వదలాల్సి వస్తోంది. ఈ విషయమై హెచ్ఎం జయప్రదను వివరణ కోరగా ప్రహరీని ఆక్రమించుకున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసి సైకిళ్ల పార్కింగ్‌కు విద్యార్థినులు ఇబ్బంది పడకుండా చూస్తామన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి



ఆటో డ్రైవర్‌కు సూచనలిస్తున్న ఎస్ఐ శివ

బొమ్మనహాళ్: వాహనదారులు పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని బొమ్మనహాళ్ ఎస్ఐ శివ హెచ్చరించారు. ఆదివారం మండలంలోని ఉద్దేహాళ్ వేదావతి హగరి వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. కూలీలను తరలిస్తున్న ఆటోలను ఆపి పరిశీలించారు. ఎస్ఐ మాట్లాడుతూ మూడు చక్రాల ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని ప్రాణాలపైకి తెచ్చుకోవద్దని సూచించారు. ఆటో పరిమితిని బట్టి ప్రయాణికులను ఎక్కించుకోవాలే తప్పా ఇష్టారాజ్యంగా ఎక్కించుకుని వారి ప్రాణాల మీదకు తీసుకురావద్దన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని విలువైన ప్రాణాలు కోల్పోయే ప్రమాదముందన్నారు. డ్రైవర్లు వాహనానికి సంబధించిన పత్రాలతో పాటు, లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

సైబర్ వల.. చిక్కితే విలవిల!

- ఖాతాల్లో మాయమవుతున్న నగదు
- బ్యాంకులు, పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్న బాధితులు



- రాయదుర్గం ఏపీడీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ ఉద్యోగి ఖాతా నుంచి రూ.24 వేల నగదు ఉన్నపళంగా డెబిట్ అయింది. ఆందోళనకు గురై ఆ ఉద్యోగి స్టేట్ బ్యాంకు, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.
- పట్టణంలోని ముత్రాస కాలనీలో నివాసం ఉంటున్న బీఎస్ఎన్ఎల్ రిటైర్డ్ ఉద్యోగి ఖాతా నుంచి రూ.లక్ష నగదు ఇతరుల ఖాతాకు మళ్లింది. సెల్‌కు మెసేజ్ రావడంతో ఆందోళన చెంది పీఎస్ లో ఫిర్యాదు చేశాడు.
- రాయదుర్గం మండలం రాయంపల్లికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తకు ఇటీవల వేతనం జమైంది. సొంత డబ్బుతో చేరి ఖాతాలో మొత్తం రూ.15 వేలు నిల్వ ఉంది. అవసరాల నిమిత్తం డబ్బు తీసుకునేందుకు వెళితే ఆగస్టు 17న గుర్తుతెలియని ఖాతాకు డబ్బు జమైనట్లు బ్యాంకు సిబ్బంది తెలిపారు. ఈ విషయం పై ఎస్‌బీఐ తో పాటు పీఎస్ ఫిర్యాదు చేశారు.
- గుమ్మఘట్ట మండలం ఆర్ కొత్తపల్లికి చెందిన సిద్దార్థరెడ్డి అనే విద్యార్థి గుజరాత్‌లో సీఎస్‌సీ చదువుతున్నాడు. ఫీజులు, ఇతర అవసరాల కోసం తండ్రి హరినాథ్‌రెడ్డి రూ.50 వేలు, ఇతర మిత్ర బృందం నుంచి రూ.42 వేలు ఖాతా కు జమ చేశారు. రెండు రోజుల క్రితం రూ.92 వేలు డ్రా చేసిట్టు మేస్సేజ్ వచ్చింది. ఖంగుతిన్న విద్యార్థి విషయాన్ని ఇంట్లో చెప్పడంతో స్థానిక పీఎస్ లో ఫిర్యాదు ఇచ్చేందుకు రాగా, గుజరాత్‌లో ఫిర్యాదు ఇవ్వాలని పోలీసులు చెప్పి పంపారు.
- బొమ్మనహాళ్ మండలం దర్గాహొన్నూరుకు చెందిన గుడ్డి వండ్రయ్య ఖాతా నుంచి రూ.20 వేల నగదు మాయమైంది. ఎవరు తీశారో..? ఎక్కడికెళ్లాయే తెలియక..? న్యాయం కోరుతూ స్థానిక పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు.

రాయదుర్గం: సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కి మోసపోతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతుంది. ఓ వైపు దీనిపై పోలీసులు అవగాహన కల్పిస్తున్నా, ఫిర్యాదులు కుప్పతెప్పలుగా వచ్చిపడుతున్నాయి. సైబర్ బాధితుల్లో ఎక్కువగా చదువుకున్న వారే ఉండడం గమనార్హం. రాయదుర్గం, కళ్యాణదుర్గం , ఉరవకొండ నియోజకవర్గాల్లో ఈ మూడు నెలల్లోనే సుమారు 60 మందికి పైగా ఈ మాయగాళ్ల ఉచ్చులో పడ్డారంటే సైబర్ వల ఎంత పటిష్టమైందో అర్థం చేసుకోవాలి. ఈ మధ్య కాలంలో బయోమెట్రిక్‌పై వేసిన వేలి ముద్రలను సేకరిస్తూ దాని ఆధారంగా నగదు దోపిడీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా సైబర్ నేరగాళ్ల పట్ల ప్రజలు మరింత జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉంది.

పాటించాల్సిన జాగ్రత్తలు ఇలా..

- బ్యాకు ఖాతా, ఆధార్‌కార్డు వివరాలు, ఇతర వ్యక్తిగత సమాచారాన్ని సోషల్ మీడియా, ఇతర ఆన్‌లైన్ వేదికల్లో పంచుకోవద్దు.
- తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు ఇస్తాం అనే వారి మాటలు, ప్రకటనలు నమ్మకూడదు.
- గుర్తు తెలియని కాల్స్, మెస్సేజ్‌లకు స్పందించరాదు. మీ ప్రమేయం లేకుండానే మీ ఫోన్‌లో ఏదైనా యాప్ డౌన్‌లోడ్ అయిందా చూసుకోవాలి. ఫోన్ వాడకుండానే చార్జింగ్ తగ్గిపోతుందంటే అనుమానించాల్సిందే.
- నా వాట్సాప్ బ్లాక్ అయ్యింది. మీ సెల్ నంబర్‌కు ఓటీపీ పంపాను. అది పంపిస్తే అన్‌లాక్ చేసుకుంటాను అని ఎవరైనా అడిగితే పొరపాటున కూడా ఓటీపీలు పంపవద్దు. తెలిసిన వ్యక్తుల్లానే నమ్మించి మోసం చేసే వారి సంఖ్య ఎక్కువైంది.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



సైబర్ మోసలపై ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలి. వ్యక్తిగత ఖాతాల నుంచి నగదు డెబిట్ అవుతున్నట్లు ఇటీవల అక్కడక్కడా సమస్య వెలుగులోకి వచ్చింది. సైబర్ నేరగాళ్ల కట్టడికి పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. ప్రజలు కూడా వీరి ఉచ్చుకు చిక్కకుండా జాగ్రత్తలు పాటించాలి. సెల్ ఫోన్‌లో కొత్తయాప్‌లు, ఓటీపీలు, ఆధార్, బ్యాంకు ఖాతాలు సైబర్ నేరగాళ్లకు చిక్కకుండా చూసుకోవాలి.

– బీ శ్రీనివాసులు, డీఎస్పీ, కళ్యాణదుర్గం